# లోగిలి

## వాడపల్లి విజయ భాస్కర రామారావు




అపరాహ్ణం.

అగ్రహారం వీధి. ఆ చివరి నుంచి ఈ చివరకు రెండుసార్లు తిరిగాడు ఆ ఆసామి.

ఎవరి ఇల్లో వెదుకుతున్నాడు. ఊరంతా మారిపోయింది. ఎవరినడగాలి?

యాజులు గారిల్లు పెద్దవీధిలోనని తెలుసు. కాని ఏనాడో నలభై ఏళ్ల క్రిందట చూసినదాయె. వాళ్లు ఇంకా ఈ ఊళ్లోనే ఉన్నారనే దేముంది? పిల్లలంతా పెద్ద పెద్ద వాళ్లయిపోయి ఉంటారు. వృద్ధాప్యం, ఎవరి దగ్గర ఉన్నారో ఏమో తనకి తెలిసిన బుగతగారు.

–ఉద్వేగం ఆగలేదు. పట్నంలో రక్కున రైలు దిగాడు. ఎన్నాళ్లయింది!

తన చిన్నతనంలో ఇంత ఊరేదీ?

పట్నానికీ పాలేనికీ నడకతప్ప మరో గత్యంతరం లేదు. మూడుకోసులూ నడవాల్సిందే సూదికావాల్సినా.

అయితేనేం, పంతులుగారింటికెళితే అమ్మ దగ్గర ఆప్యాయత దొరికేది.

"అప్పడూ! బువ్వ తిందువుగాని, పెందరాడేపని పూర్తి చేసుకునేది" అనేవారు ఆ ఇల్లాలు, మాతల్లి–మాలక్ష్మి.

"ఏమండీ!... సార్!" అప్పలస్వామి కొంచెం బిడియం అనిపించింది. "బాబూ! చాలా కాలం నాటి మాట! ఈ వీధిలో సోమయాజులుగారని బుగతగారు ఉండేవారు. వారి ఇల్లు గుర్తుపట్టలేక పోతున్నా... అగ్రహారంవీధి ఇదే కదూ!"

"అగ్రహారం వీధి ఇదే . కానయితే సోమయాజలు గారని నే వినలేదే. సుమారు ఎంత వయసుంటుంది?... ఆయన ఎందులోపనిచేస్తున్నారు?"

"పనా? ఆయనకి పనేమిటి? పేద్ద బుగత... పాలెంలో భూములు సగం వారివే ఇక వయసంటారా? ఏ ఎనభయ్యో ఉంటాయేమో! ఇళ్లన్నీ మారిపోయాయి. వీధిలో చాలా డాబాలూ, మేడలూ లేచిపోయాయి. ఏ ఇల్లు వారిదో తెలియడంలేదు

నేను చూసిన ఊరేనా అనిపిస్తుంది. వారిని ఓ మారు చూసి పోవాలని వచ్చాను "

"పేరేమిటన్నారు?"

"సోమయాజులుగారు "

"నాకు తెలిసి ఆ పేరుగల వాళ్లెవర్నూ ఇక్కడలేరు అసలు అంత పెద్దాయన ఈ వీధిలోనే ఉన్నట్టు-లేదు.. అటు ఆ నాలుగో డాబా ఇల్లు . ముందు కొబ్బరి చెట్టుందే అక్కడ భోగట్టా చెయ్యండి! కుక్కలుంటాయి సుమండీ! జాగ్రత్త! ఇంతకీ ఏ ఊరు నుంచి వస్తున్నారు?"

"ఢిల్లీ నుంచి "

"ఓహ్! ఉద్యోగమా?"

"రాజ్యసభ సెక్రటేరియట్ పని చేసే వాడిని. రిటైరై పోయాను "

"క్షమించండి! నాకు పని ఉంది డాబా ముందు అడగండి. "

–అప్పలస్వామికి గుండెల్లో ఏదో గుబులు ఢిల్లీ-లోనే మనుషులు పరుగులు పెడుతున్నారనుకుంటే ఈ పట్నంలో నూ అంతేనన్నమాట

అసలు తన వెర్రిగాని ఏ నాటి మనిషో ఆయన ఇంకా ఇక్కడే ఉంటారా? పిల్లలందరూ ఎదిగి ఏవో ఊళ్ళు వెళ్లి పోయారో. "

డాబా ఇంటి ముందు ఆగాడు ఆయన.

"ఏమండీ! సోమయాజులుగారని ఓ పెద్దాయన.. "

"అల్లదిగో. . పెంకుటిల్లు . పెణక జారిపోతోందే అదే. ఏమైనా బాకీ "

"ఛ..ఛ . అదేం కాదండీ.."

అప్పలస్వామికి కొంచెం బాధనిపించింది. బుగతగారి గురించి ఎందుకిలా అన్నాడాయన.! ఏదో కుర్రతనం అని సరిపెట్టుకున్నాడు.

పెంకుటింటి ముందు తారాట్లాడుతున్నాడు వీధి తలుపులు వేసి ఉన్నాయి ఇల్లు ఏ కారణంచేతనో చిన్నదయినట్టుంది. భూమిలోకి దిగిపోయి-నట్టుంది. చూరుబల్ల పోయింది పెణక కుంగి-పోయింది.ఎప్పుడు పడిపోతుందోనన్న భయం కలిగిస్తోంది

అరుగు మీదకొచ్చాడు

తలుపు తెరచుకుంది. ఇద్దరు బ్రాహ్మలు బయటకువచ్చి రొంటిలో ఉబ్బులు దోపుకుంటూ వెళ్లిపోయారు.

–కొంపతీసి సోమయాజులుగారు చనిపోలేదు-కదా!

ఛి. ఛీ! ఎందుకింత చెడ్డ ఆలోచన వచ్చింది. ఆయనను చూడాలనే ఆతృతతో నేకదూ తను ఇంత హటాత్తుగా అక్కడ దిగింది!

తలుపు దగ్గర పిలవడానికి ధైర్యం చాలలేదు తలుపు మళ్లీ తెరచుకుంది.

లోపల నుంచి ఓ ముసలావిడ ఎంగిలాకులు తెస్తూ అరుగు మీద మనిషిని చూసి తలుపువారకు వెళ్లిపోయింది.

# లోగిలి

"ఉమ్మ్!" మరి ఉండబట్టలేక పోయాడతను. ఆమె విస్తరాకులు వీధిలో గిరవాటేసి -గిరుక్కున తిరిగి లోపలకు వెళ్లింది

"ఎవరు కావాలి బాబూ!"

"పాలెం రైతు వీరాస్వామి కొడుకు-" అప్పల-స్వామిని .. సోమయాజులు గారిల్లు.. ?"

"ఇదే లోపలకు రండి "

ఆవిడ లోపలకెళ్లి వసారా గోడ వెనుక నుంచి చెప్పింది.

"వీరాస్వామంటే పాలెంలో ఒకప్పుడు మా రైతు కదూ.. అవే నాటి రోజులు... ఉండు.. జ్ఞాపకం వస్తోంది. పెంటమ్మ అప్పుడు. ఇంత ఉండే-వాడు అప్పుడు ."

"అవునమ్మా ఆ అప్పుడిని నేనే. పెంటమ్మ మా చినచెల్లి.. బాబుగారు "

తెలుస్తూనే ఉన్నా వివరాలు కోసం– తన అశ్రు తర్పణానికి నాందిగా, సానుభూతి చూపడానికి ముందుమాటగా– అడిగాడు

"కాలం చేసి ఆరేళ్లయింది ఈ రోజ' వారి ఆబ్దికం ...పెద్దబ్బాయ్!"

– రామస్వామికంటే చిన్నతను ఒకాయన గావంచా కట్టుకుని వచ్చాడు.

"క్షమించండి! అబ్బక 'దా' అంతా మడిలో-ఉన్నారు నాకు తెలియక ."

"ఏం ఫరవాలేదు నాన్న మీకు బాగా తెలుసా!"

"తెలుసా?! ఎంత మాట బాబూ! అప్పటికి మీరు పుట్టలేదసలు నేనింతవాడిని కావడానికి కారణం ఆ అయ్యచలవ. మన అమ్మగారి ఆశీర్వచనం .. వారు పోయారని కూడా నే నెన్నడూ వినలేదు. నేను ఇటువచ్చే నలభై ఏళ్ళుదాటి పోయిందేమో . దేశం రాగానే ముందు తమ ఇంటికే రావాలనిపించింది రైలు దిగాను. . ఆయితేనేం వారిని చూసే అదృష్టం నాకు లేదు .. తమకి భోజనానికి వేళ నాకు సెలవు ఇప్పిస్తే సాయంకాలం తీరికగావచ్చి దర్శనం చేస్తా..."

"ఫరవాలేదు.. నాన్నగారికి మేం ఏం చెయ్యలేక పోయాం చాలా రోజుల వరకూ వారికి సంతు లేదని బెంగ. మేం పుట్టుకొచ్చాక ప్రయోజకులం కాలేదని ఆరాటం. నాకుచదువు అబ్బలేదు... నాన్నగారే లారీలో పెట్టేశారు... ఇప్పుడు డ్రైవరుగా ఉన్నా. "

గావంచా కట్టుకున్నా ఆయనలో విచారంలేదు. "బాబూ కాలం మారింది... అమ్మగారిని ఇలా చూస్తా నసుకోలేదు తల్లిలేని బిడ్డనని నన్ను చాలా ఆప్యాయంగా చూసేవారు. మీరే చూశారుగా. అప్పుడని నన్నింకా జ్ఞాపకం ఉంచుకున్నారు. బాబూ, తమ తోబుట్టువులు . "అప్పలస్వామికి వివరాలు వినాలని ఆశ. "అప్పుడూ ఋణా సంబంధం ఉంది కాబట్టే బాబు ఆబ్దికం నాడువచ్చావ్ . భోక్తలు-వెళ్లారు. నువ్వూ కాళ్ళు కడుక్కో . "

రామస్వామికి కాదనాలని లేదు. కానీ వెళ్లడానికి మనసు రావడంలేదు వారి పంక్తిన భోజనం . తన చిన్ననాడు ఆ ఆలోచనకి అవకాశమేలేదు వారు పంక్తిలో భోజనం పెడతారా? పెడితే ఈ పట్నాంతో ..ఎలా?

"ఎందుకు లెండమ్మగారూ. నే వెళతా !"

"ఎంత మాట! నా బిడ్డలాంటి వాడివి ఆయనకు నువ్వంటే ఎంత అభిమానమో ఆయన నాటి అభిమానమే నేటి మా ఊపిరి . చితికి పోయాం భూములు పోయాయి మా అంతస్తు పడిపోయింది పూర్వపు గౌరవం మాకు లేదు . కాయకష్టం చెయ్యడం రాక ఇతరుల శ్రమతో బ్రతుకే అందరితో-పాటు మాకూ ఈ స్థితి వచ్చింది . ముందు భోజ-నానికిలే. తరువాత తీరికగా మాట్లాడుకుందాం.. లక్ష్మీ మరో విస్తరి వెయ్! . పాత కాలం చనువుతో 'నువ్' అనేస్తున్నాను ఏమనుకోకు నాయనా . "

రామస్వామి గోడవారికి కూచున్నాడు. పంక్తిలో బుగతగాబ్బాయి, మనవడూ, మనమరాలూ ఉన్నారు. వడ్డిస్తూ ఆవిడ మాటాడుతూనే ఉంది.

"ఆదరించడానికి ఈ నాడు మా దగ్గర అయివేజు లేదు... కాని పాత కాలం మనుషులం మీ నాన్న ఉండగా మాకు భూమి తగాదాల్లేవు. పంట ఇంటికొచ్చేది. రాజాల్లాగా బ్రతికాం కాని ఇప్పుడు కాలం మారిపోయింది."

". . . మీ పంక్తిన.... ఆ రోజుల్లో ఎన్ని గుండె-లుండాలి! మీ ఆదారం వేరనుకోండి!"

"అలా కాదు బాబూ! మారుతున్న కాలంతో మనమూ మారాలి. రైతైనా, బగతైనా పంక్తిలో ఉండాలన్నదే ఈ నాటి మార్పు. నువ్ నా పెద్ద కొడుకువనుకుంటున్నా... ఈ రోజు వచ్చావ్! ఎవరు పిలిచారని?అదే ఋణానుబంధం . ఆయన ప్రసాదం తినాలని ఆయన ఆశీర్వచనం పొందాలని ఆ భగవంతుడి నిర్ణయమన్నమాట .. నూలు పచ్చడి వేయించుకో..లక్ష్మీ గారెలు వడ్డించు. ."

రామస్వామికి బెరుకు పోయింది. హాయిగా భోజనం చేస్తూ అడిగాడు.

"అమ్మా తమకి.. . ఆడపిల్లలు...?"

"పెద్దకంటే పెద్దది.. మొన్ననే పోయింది... ఇద్దరి పిల్లల తల్లి . వాళ్ల పిల్లలు పెద్దవాళ్లయినా మేం పెట్టు పోతలు పొయ్యడం లేదని ఈసడింపు .అది పోయిందని చెప్పడం కంటె ఘోరమైన విషయం . నూతిలో దూకి పోయింది. భర్త ఇంకొకర్తిని తీసు-కొచ్చి ఇంట్లో పెడితే ఏం చేస్తుంది. ఆ స్థితికి దిగజారిపోయాం. మమ్మల్ని ఇప్పుడు ఎందుకు గౌరవించాలి? . అందుకే గౌరవించరేమో!"

కూతురు పోయిందన్న విషయంకంటే వాళ్ళు దిగజారిపోయిన విషయం ఆవిడకు వేదన కలిగిస్తు-న్నట్టు రామస్వామి అర్థం చేసుకో గలిగాడు. ఉన్నతుల పరనం సామాన్యుల పతనంకంటె వెయ్యి-రెట్లు బాధను కలిగిస్తుందని తను ఎక్కడో చదివాడు. ఎలాంటి కుటుంబాలు ఎలా దిగజారి పోయాయి !

భోజనా లయ్యాక బయట వసారాలో కూచున్నాక అడిగాడు. "అమ్మా బాబుగారి చలవ మీ ఆశీర్వ-చనం.. మీ రన్నట్టు ఆ బంధమే నన్ను ఇవాళ నేననుకోకుండానే లాక్కొచ్చింది మీ ఋణం ఎలా తీర్చుకుంటానో "

"అంత మాటనకు బాబు చిన్న వయసు నుంచీ చదువుకుంటున్న పిల్లలందరి ఎడలా ఆపేక్ష చూపే-వారు. శ్రమ ఒకరిది. సుఖం ఒకరిది కాకూడదనే అనే వారు. చితికి పోయినా అందుకే మేం కాయకష్టం మీదే బ్రతుకుతున్నాం లారీ డ్రయివరయితేనేం ఒకర్ని యాచించకుండా బ్రతక గలుగుతున్నాం భగవదేచ్ఛ!"

"బాబూ. మీ అబ్బాయి. అమ్మాయీ. చదువు-కుంటున్నారా?"

"పెద్దాడు టెన్త్ ఫెయిల్ అయ్యాడు కష్టంమీద మా తాత ముత్తాతల్లాగే వాడికీ తెలియదు నాకూ ఆ వయసులో తెలిసేది కాదు, గారంవల్ల ఏదో సినిమాహాలో పనిచేస్తున్నాడు "

"అమ్మా తమరు భోజనం చెయ్యలేదు వెళ్లం-డమ్మా!" అప్పలస్వామి అన్నాడు మీరు భోజనంచేసి రండి, నేనూ బాబూ మాటాడుతూ ఉంటాం.

ఆవిడ లోపలకు వెళ్లింది

"బాబూ! నా కంటే మీరు చిన్నవాళ్ళు నేను మీ ఇంట్లో తిరిగే రోజుల్లో మీరు పుట్టనేలేదు . మీ నాన్నగారు నాకు చేసిన ఉపకారం మనిషిగా నేను మరచిపోలేను అమ్మగారూ పెద్దవారయి పోయారు - మీతో చెప్పకేం . ఆ రోజులూ ఆ అభిమానాలూ వేరు. మా అన్న దమ్ములు చూడండి నా దగ్గరకురారు. నే వెళ్లినా నన్నెవరో అన్నట్టు విరుసుగా చూస్తారు ఆస్తి అడుగుతానని భయం. నేను ఢిల్లీ మనిషిని . నేను వాళ్ల మధ్య ఉండలేనని వాళ్ల వాదన నాకు కావల్సింది ఆస్తి కాదు తోబుట్టువుల ఆప్యాయత అది నాకు లేదు ఆస్తి అక్కరలేదని చెప్పడానికే వెళుతున్నా "

రామస్వామి గొంతులో ఆవేశం.

"ఏం చేస్తాం బాబూ! డబ్బు రోజులొచ్చాయి . మా చిన్నాన్నలూ నన్ను పలకరించరు డబ్బుతో పాటు మేం కులమూ పోగొట్టుకున్నామనే వారి భావన "ఒక విధంగా అది నిజమేనేమో! నాకున్న ఒక్క కూతురి పెళ్లి చేస్తే ఈ పెంకుటింట్లోంచి పాకలోకి పోవాల్సిందే. భూములూ ఆస్తులూ పోయాయి చదువు అబ్బలేదు స్వశక్తి మీద ఆధార పడడం నేర్చుకుంటున్నానే కాని బంధువులతో చిన్న చూపు తట్టుకోలేక పోతున్నా అబద్ధాలూ అన్యాయాలూ వీటికి పాల్పడ నక్కరలేకుండా జీవితం ఈ మాత్రంగా గడపగలిగితే అంతే చాలు "

–"నీ కెంతమంది పిల్లలు బాబూ!"

ఆవిడ భోజనం ముగించి బయటకొచ్చి అడిగింది

"పెద్దది ఢిల్లీలోనే పని చేస్తోంది ఒక పంజాబీ అబ్బాయిని పెళ్లి చేసుకుంది నేను కాదనలేదు మన మాటలూ, మన మనసులూ వాళ్లకి అర్ధంకావు. వాళ్లని అర్ధం చేసుకోవటమే మనం చెయ్యాల్సిన పనేమో! అబ్బాయి ఇంజనీరుగా ఉన్నాడు తెలుగు పిల్లను చేసుకుంటే బాగుంటుందని ఆలోచన వాడేం చేస్తాడో! నాకు భార్యలేదు రిటైర్లైపోయాను నాకు విచారాలు లేవు లేకుండా చేసుకుంటున్నాను "

"సంతోషం బాబూ! ఆశీర్వచనం.!

"అమ్మగారూ, నాదొక చిన్న కోరిక "

చెప్పు నాయనా!"

"మీకు నేను చాలా చాలా ఋణపడి ఉన్నాను నాకు విద్యా భిక్ష పెట్టింది మీరు ఋగతగారయితే కనమరుగయిపోయారు కాని భగవంతుడిదయవలన మిమ్మల్నయినా చూడగలిగాను అసలు సంగతి మీదగ్గర దాచడమెందుకు కాని మా అయ్యనా చిన్నతనంలో నేనాకొక మాట చెప్పాడు

ఒరి నాయనా, అప్పుడూ! ఋగతల్లోనూ, భూ కామందుల్లోనూ కూడా శానా మంచోళ్లున్నారు మన ఋగత మడిసికాదు దేవుడు ఇలాసింటోడు కోటి కొకడే ఉంటాడు మీ యక్క పెద్ద మడిసయితే ఆ రోజు సేత కానిలేదు సెయ్యాలల్సినవి సెయిక తప్పదు దేవుడిలా గొచ్చినాడు ఆయాలెందుకో! కళ్లలంకాడి నుంచి కబురు. లగెత్తుకెల్లినా! ఆరి కేలా తెలిసిందో రొంటి నుంచి బొత్తిడి నోట్లిచ్చి-నాడు. పోని అది సరేననుకో మీ అన్ననడుగు బొట్టి పెల్లి కర్సులికి రెండు వేలవుతాయన్నారు. రెండు-వేలేటి? నేనెక్కడ? పూట బంత్తిం పుల్లలకూ ఇది గందా మన బతుకులు. నువ్వేటి కాలేజేటి? నీకు ఎంత కరుసవుతుంది ఎలాగిస్తన్నాడో ఆ దేవుడి కెరుక! నా సెరమం సెప్పులు కుట్టించినా నీ ఋణం తీర్చుకోలేను. ఋగతా! అంటే అదేటిదవా! నీ బిడ్డేటి నా బిడ్డేటి. ఆడ సదూకుంటన్నాడు అంతే! నా బిడ్డయితే సదూకుంటానంటే సదూ సెప్పించ ననేస్తానేట్రా ఆ యమ్మ ఋగతే అనుకుంటే అంతకంటే 'అన్నపూర్ణమ్మ ఈరాసామీ, నీ కష్టం మేం తింటూనే ఉన్నాం పిల్లోడు సదూకో! అనేది పెంటమ్మ నీ బొట్టి కాయ ఈరాసామీ నా. బొట్టే అయితే పెళ్లి చేసుకోమా! అన్నది అంతే ఋగత లెక్కెట్టి రెండేలు ఇచ్చేసినాడు. అలపింటి మడిసి ఋణం నేను తీరుసుకోలేన్రా నీకు బగమంతుడిచ్చి-నపుడు నువ్ ఆ ఋణం తీర్చుకోరా! ఆళ్ల దీవెన బగమంతుడు దీవెన్రా నాకయినా నీకయినా నీ సంతుకయినా ఆల్ల దీవెనలే బగమంతుడి దీవెనలు ఆల్ల ఋణం తీర్చుకో..

....అమ్మా, ఇవీ మా నాన్ననాకు చాలాసార్లు చెప్పిన మాటలు ..

"నీ అభిమానం కాని చేసేవాళ్లం మనంకాదు బాబూ! ఆ భగవంతుడి దయ నీ మీద ఉంది నీ చదువుకి ఎవరో సాయం చేయాలి మా చేత చేయించాడనుకో అది నీ పుణ్యం మా గొప్ప కాదు.."

"ఆలా కాదమ్మా, అబిమానానికి విలువకట్టడం నా ఉద్దేశం కాదు... ఆ మహానుభావుడికి నా ఆశృత తర్పణంతో పాటు ఈ లోగిలికి నేను ఋణపడి ఉన్న దానిలో లవలేశం నేను తీర్చడం నా విధి. కాదనకండి. ఇందులో వడ్డీ లేదు. అసలూ కాదు. లెక్క లేని ఆదరానికి స్వర్గాన్న ఉన్న ఆయన చల్లని చూపుకీ మీ ఆశీర్వచనానికీ వెల ఎవరు కట్టగలరు.... ఈ సొమ్ముంచండి... నా పిల్లకి మీరెవరో నేను 'రోజూ చేబుతూనే వచ్చాను.. వాళ్లనూ ఆశీర్వదించండి.!"

జేబులోనుంచి డబ్బు తీసి ఆవిడ కాళ్ల దగ్గరుంచి వసారా గోడకి ఉన్న పెద్ద ఫోటోకి చేతలు జోడించి కళ్ళు మూసుకున్నాడు రామస్వామి. □

"టీనేజ్" కంప్లీట్ షాంపూ మార్కెట్‌లో విడుదలైన సందర్భంగా విజయవాడలో ఏర్పాటు చేసిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తున్న మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ టి శ్రీనివాస్, శ్రీ సి. నరశింహారావు, శ్రీ లంకా గోవిందరాజులు, డాక్టర్ కె శ్రీనివాసరావు, కుమారి సంయుక్తలను చిత్రంలో చూడవచ్చు

